# కథార్థం-యథార్థం

పోటీ నియమాల ప్రకారం కథలో రెండువేల మాటలకన్నా ఎక్కువ ఉండకూడదట. కాబట్టి తిన్నగా చెప్తున్నా "ఏ అడ్డూ లేకుండా దొంగ ఇంట్లో ప్రవేశించాడు" అని.

నాచేత ఇంకా మాటలు ఖర్చుపెట్టించకుండా దొంగ, వంటింట్లోంచి డ్రాయింగు రూములోకి దారితీశాడు. ఎదురుగా గోడలో అమర్చబడ్డ ఇనప్పెట్టిమీద అతని టార్చిలైటు లైటు పడింది. వెంటనే దగ్గరకెళ్ళి దానిని పరీక్షగా చూశాడు. అనుభవమున్న అతని కళ్లకి వెంటనే దాని తాళం కనపడిపోయింది.

సరిగా అప్పుడే ఒక్కమాటుగా 'క్లిక్' మని చప్పుడయింది. ఎవరో ఎలక్ట్రిక్ దీపం స్విచ్ నొక్కారు. తీక్షణమైన విద్యుత్ కాంతి ఆగదిలోకి ఒక్కమారుగా వచ్చి అప్పటివరకు కనపడని గది ఒక్క క్షణంలో ప్రత్యక్షమైనట్టు అనిపించింది. వెలుతురు ద్వారంమీద పడి ఆసిల్కుకర్టెన్ కదలికలను స్పష్టంచేస్తున్నది. కర్టెన్ పక్కకి తొలగి, నీలిచొక్కా, కాకీ నిక్కరూ తొడుక్కున్న ఏడెనిమిదేళ్ల బాలుడు గదిలో ప్రవేశించాడు. మృదువైన స్వరంతో, ముద్దొచ్చేమాటలతో అతనడిగాడు- "నువ్వు దొంగవా?"

బొంగురుపోయిన గొంతుకతో దొంగ తనలో తనే గొణుక్కున్నాడు..."బాగానేవుంది! ఈవింత చూడు! నేను దొంగనేనా, అని అడుగుతున్నాడు. వెధవన్నర వెధవ! మూడురోజులనుంచి పెరుగుతున్న గడ్డం, ఆకలితో వెన్నుకంటుకుపోతున్న కడుపూ, నిప్పుల్లాంటి నాకళ్ళూ కనిపించడంలేదూ?" - కాని పైకిమాత్రం "వెళ్లు, ఇక్కణ్ణించి వెళ్ళి, చల్లగా మీ అమ్మదగ్గర నిద్రపో. ఎవళ్ళనేనా లేపడానికి ప్రయత్నించావంటే జాగ్రత్త" అంటూ బెదిరించాడు.

"ఇంట్లో నన్ను తప్పించి మరెవ్వరూ లేరు, పనిమనిషికి అప్పగించి అమ్మా నాన్నా సినిమాకి వెళ్ళారు. పనిమనిషి మరో నౌకరుతో వెన్నెల షికారుకి బయలుదేరింది."

"అయితే మరీ మంచిది! కాని గోలచేసే పిల్లిపీక నులివేసినట్లుగా నీపీక నులిమేస్తాను."

"పిల్లిపీక నులిమెయ్యటమేమిటి, కోళ్లని పీకనులిమేస్తారు కాని! ఇంత దొంగవై ఉండీ ఈ చిన్న విషయం తెలీదూ?"

"నన్ను చూస్తే నీకు భయం వెయ్యటం లేదా, అబ్బాయ్?" అడిగాడు దొంగ.

"చూస్తూనే ఉన్నావుగా! నేను కథలో ఒక పాత్రనని నాకు తెలియదూ? నిజంగా జీవితంలో జరిగే సంఘటనే అయితే నేను జోరుగా అరుద్దును. నే నేడుపు లంకించుగోగానే నువ్వు కాళ్లకి బుద్ధిచెప్పి పరిగెడుదువు."

"ఓహో! అదా సంగతి. నువ్వు కథలో ఒకపాత్రవన్నమాట...ఐతే నడవనీ కథని."

అబ్బాయి దొంగ ముందున్న కుర్చీలో కూర్చుని మొదలెట్టాడు—"తస్కర మహాశయా! నువ్వు దొంగతనం ఎందుకు చేస్తున్నావు? నీకు ప్రపంచంలో సానుభూతి చూపించే మిత్రులెవరూ లేరా?"

**'సోమేశ్వర్'**

దొంగ ముఖకవళికలు ఒక్కమారుగా మారిపోయాయి. 'ఓస్! ఇంతేనా' అన్న భావం అతని ముఖంమీద రాసినట్టుగా కనిపించింది.

"ఇదా, నీ ఉద్దేశం. కాని అబ్బాయ్! ఇది పాత ప్లాటే! దొంగతనానికని, ఇంట్లోకొక దొంగ ప్రవేశిస్తాడు. అక్కడతనికి కనిపించిన ఒక చిన్న పిల్లడి నిర్మలమైనమనస్సు చూసి అతని మనస్సు మారిపోతుంది. అతను మళ్లీ న్యాయబద్ధమైన ఒక నాగరిక వ్యక్తిలా జీవితం మొదలెడతాడు. అంతేనా? కాని నేనంత పిచ్చివాడి ననుకున్నావేమో! ఊహూఁ నీ వల్లో నేను పడనులే."

"ఒక క్షణం ఇక్కడే ఉండు, నీకు ఆకలిగా ఉందేమో-తినడానికేమేనా తెస్తాను" అని బయలు దేరాడు ఆ పిల్లడు. దొంగ అలాగే నిలబడ్డాడు. అబ్బాయి తీసుకొచ్చిన పూరీలు, మిఠాయి తిని, నీళ్ళు తాగి, త్రేన్చుతూండగా అబ్బాయి మళ్ళా అడిగాడు—

"అవునుకానీ, నువ్వు దొంగతనం ఎందుకు చేస్తున్నావో చెప్పలేదే?"

పొంగివస్తున్నట్టున్న దుఃఖాన్ని మింగుతున్నట్టున్న గొంతుకతో దొంగ జవాబిచ్చాడు-"నాయనా! నాకుకూడా నీలాంటి వాడే కొడుకొకడున్నాడు. వాడు ఎన్నాళ్లనుంచో ఆకలితో మాడిపోతున్నాడు."

"అదుగో మళ్లీ పప్పులో కాలేస్తున్నావ్" అన్నాడబ్బాయి. "ఇంత వేగం అదంతా చెప్పేస్తే కథకి కావలసిన 2000 మాటలూ ఎలా వస్తాయ్!"

"ఐతే విను. నేనుకూడా ఒక ఆఫీసులో గుమాస్తాగా పనిచేస్తూ ఉండేవాణ్ణి. మా ఆఫీసరు ఒకనాడు ఇనప్పెట్టిలోంచి కొంత తీసుకుని ఆ నేరం నా మీదకి నెట్టేశాడు. నామాట వినేవాళ్ళెవరూ లేకపోయారు. ఉద్యోగం పోయింది—కాళ్లరిగిపోయేటట్టు తిరిగినా కాని చేతికొచ్చేదికాదు. చూసే దిక్కులేక జబ్బుతో ఉన్న నా భార్య చచ్చిపోయింది. ఒక్కడే ఒక్కడైన ముద్దు కొడుకు ఆకలికి అలమటిస్తూ చావసిద్ధంగా ఉన్నాడు."

"అది సరేలే. అదప్పుడే విన్నాను—కాని వచ్చిన సమస్యేమిటంటే, ఇంక కథని ఎలా నడిపించడమూ అని."

"అదెంతపని. నాపిల్లడి దుస్థితివిని నీమనస్సు కరిగిపోతుందనుకో. అప్పుడు నువ్వు లోపలికెళ్ళి, మీ అమ్మ నెక్లేసు తీసుకొచ్చి ఆనందంతో నాకిచ్చేస్తావన్నమాట. ప్రవహిస్తున్న కన్నీళ్లతో నిన్ను ఆశీర్వదించి నా దారిన నే పోతాను. ఎలా ఉంది కథ?" అడిగాడు దొంగ.

"ఆహాఁ! చాలా బావుంది. నే నేమంత వెర్రివెధవ ననుకున్నావా?" అన్నాడు డింభకుడు, ఈసడింపుగా.

దొంగకి కోపం వచ్చినట్టుంది. పళ్లు పటపట కొరుకుతూ హూంకరించాడు—"నీ నోట్లో గుడ్డలు కుక్కేసి కాళ్ళూ చేతులూ కట్టి పారేద్దామనిపిస్తూంది. గట్టిగా మాట్లాడితే చేసేస్తాను కూడా!"

విసుగుదలతో, బోధపరుస్తున్నట్టుగా, అన్నాడు అబ్బాయి: "అలాగైతే ఈ కథకి ఏ సంపాదకుడూ తన పత్రికలో జాగా ఇవ్వడు."

"అయితే మరేంచేసేది? నాలాంటి పేద వాడిమీద దయ రావడంలేదూ? నువ్వు చాలా మంచివాడివి, వెళ్ళుబాబూ, వెళ్ళి మీఅమ్మ నెక్లేసు తీసుకొచ్చి ఇచ్చేయ్. ఇంకా ఆలోచిస్తున్నావేం?"

"నా ఉద్దేశం ఈపాటికి కథలోకి పోలీసు రావాలేయాలని."

చేబిలుకొత తో చెయ్యి తుడుచుకొని దొంగ లేచాడు. "అబ్బా!—ఇంక నేను వెళతానబ్బాయ్. భగవంతుడు నీకు మేలు చేస్తాడులే. ఇవాళ ఒక అపరాధం చేయబోతున్న నన్ను నివారించావు. ఇవాళ నుంచీ, నేను దొంగతనం చెయ్యడం మానేద్దా మనుకుంటున్నాను. చేసి నా పాపపతేదీ లేదనుకో. కథకుడు నడిపినట్లుగా నడుచుకునే పాత్రల మేకదా మనం."

ఆవలిస్తూ బరువెక్కిన కళ్ళతో పిల్లడన్నాడు. "నాక్కూడా నిద్దరొస్తోందనుకో, కాని ఈకథ ఇంకా రక్తికట్టలేదే. రొంపో, క్లైమాక్సూ, లేకుండా కథేమిటి!"

"కథలోకి 'ఇంటరెస్టు' తెప్పించాలంటే ఇప్పుడు నేను నీపీక పిసికేసి, మూంఛి లెదరు సూటుకేసులో నిన్ను కుక్కి తాళంవేసి, సినిమాపాట ఈలవేసుకుంటూ, సూటుకేసు ఊపుకుంటూ ముందరిద్వారంలోంచి బాటెయ్యాలి. కాని ఇలాంటి కథ అమెరికా లోని 'క్రైము' పత్రికల్లో తప్ప మరెవరూ వేసుకోరు."

సానుభూతి కనిపిస్తూ అబ్బాయిఅన్నాడు వెంటనే: "అవునవును. అదినిజమే! ఇలాంటికథలు మన పత్రికల్లో తక్కువే. వేసుకుంటారనుకో? కాని ఫరవాలేదులే—మనవాళ్ళుకూడా ముందడుగు వేస్తున్నారు. ఈమూ రొచ్చినపుడు నాప్రాణం తీసి మరీ వెళతావు కాబోసు."

తనసంచీ సర్దుకుంటూ దొంగలేచి నిలబడ్డాడు. "చూడబ్బాయ్!—కథకి కావలసిన రెండువేలమాటలూ పూర్తికావస్తున్నాయ్. ఇంక నేను సెలవు తీసుకోవాలి."

"ఉండుండు—పాపం, ఆకలితోపడున్న నీకొడుక్కి మిఠాయి పొట్లాం కట్టిఇస్తాను."

దొంగ ఫక్కున నవ్వాడు. "నాకొడుకు ఆకలితో మాడిపోతూ ఉండడం కథలో మాత్రమే. ఇప్పటికే వాడు ఒకటో రథమైన కారు వేసుకొని షికార్లుకొడుతూ ఉంటాడులే."

"అయితే పద, ముందరితలుపు తీస్తాను."

"అహఁ హఁ—అలామాత్రం చెయ్యొద్దు. ద్వారం తెరుచుకోగానే చిరునవ్వుతో పోలీసువాడు ప్రత్యక్షమవుతాడు. కథల్లో పోలీసులకి అదిఒక అలవాటు కథలో దొంగ పట్టుబడి తీరుతాడుకదా!"

"మరి...ఐతే?"

"ఇంకేం! నేనిక్కడ నిలబడ్డటుగానే మాయమైపోతాను. చదువరుల కళ్ళల్లో మన్నుకొట్టడం ఏమంత కష్టం?"

అన్నట్లుగానే దొంగ, అక్కడికక్కడే గాలిలో లీనమయి పోయాడు. ★


# వేడిగాగాని చల్లగాగాని ఎట్లాగైనా అది మంచిది!

ప్రతి ఋతువులోనూ మీరు 'ఓవల్‌టైన్'వల్ల ప్రయోజనం పొందుతారు. ఎందువల్ల ననగా, రుచికరమైన ఈ ఆహార పానీయము వాయు స్థితి ననుసరించి చల్లగాగాని, వేడిగాగాని తీసుకొనవచ్చును. మీకు వేడిగా వున్నప్పుడు వేడి 'ఓవల్‌టైన్' తీసుకుంటే అది నేదదీర్చి చల్లపరచును.
'ఓవల్‌టైన్' ప్రకృతి సిద్ధమైన మంచి ఆహార ద్రవ్యములతో చేయబడినది. అది, విటమినులు కూడా చేర్చబడి వేడిగా తీసుకొన్ననూ, చల్లగా తీసుకొన్ననూ ఒకే మాదిరి పుష్టి పదార్థములను చేకూర్చును.




సిలోన్ రేడియో మీద ఓవల్‌టైన్ అమెచూర్ కాలక్షేపం వినండి. (హిందీ - 41.72 మీటర్లు) శనివారముల రాత్రి 8 నుంచి 8.30 గం.లు (ఇంగ్లీషు - 9520 కిలో సైకిల్సు-31 మీటర్లు) ఆదివారముల రా. 8 నుంచి 8-30 గం. లు.



ప్రతి డబ్బాలో ఆరోగ్యం వున్నది

## ఓవల్‌టైన్

డిస్ట్రిబ్యూటర్లు:
గ్రాహమ్స్ ట్రేడింగ్ కంపెనీ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్

IV. 302